## సింగిల్‌పేజీ కథ



# చేరని సందేశం

### ఎ.వి.రెడ్డిశాస్త్రి

సార్వభౌములవారు మరణశయ్య మీద ఉన్నారు. ప్రజాహితంగా ఎన్నో సంవత్సరాలు పరిపాలన చేసి ఉండడం వలన అతనంటే ప్రజలందరికీ వల్లమాలిన అభిమానం. అలాటి గొప్ప ప్రభువు మరణించబోతున్నాడని తెలిసే టప్పటికి ప్రజలకి భయం పట్టుకుంది- తదుపరి సార్వభౌముడు ఎలాటివాడు వస్తాడోనని. ఆ వచ్చేవాడు ఈ ప్రభువులాగే ప్రజాహితంగా పరిపాలన సాగిస్తాడో లేదోనని భయం అందరికీ. ఈ రకమైన ఆందోళన వల్ల తిండీ నిద్రల సంగతి కూడా సరిగ్గా పట్టించుకోకుండా ప్రజలంతా ప్రభువులవారి కోటచుట్టూ పడిగాపులు పడి కూర్చున్నారు- ఆశనిపాతం లాంటి ఆ దుర్వార్త వినడం కోసం.

ఇంతలో మృత్యుముఖంలో వున్న సార్వభౌములవారికి కాస్త తెలివి వచ్చింది. కళ్లని భారంగా తెరచి, బహు ప్రయత్నంతో చుట్టూ కలయజూసేరు. చుట్టు వున్నవాళ్లకి అర్థంవయిపోయింది- ప్రభువులవారి కళ్లు ఎవరికోసమో వెదుకుతున్నాయని. ఆప్తులుగా పరిగణించబడుతున్నవాళ్లంతా వారి తల్పంచుట్టూ గుమిగూడేరు. కాని ప్రభువుల కళ్లు వెతుకుతున్నది వేరే వ్యక్తి కోసం. ఇంతలో గుమిగూడి వున్నవారిని సున్నితంగానూ, మర్యాదగానూ తప్పించుకుంటూ ఒక సామాన్య సైనికుడు సార్వభౌములవారి సన్నిధికి చేరుకున్నాడు. వారు తమ తలని బరువుగా ఆడించి, సౌంజ్ఞ చేసి, ఆ భటుడ్ని దగ్గరకి రమ్మని పిలిచేరు.

భటుడు వినయంగా సమీపించేడు సార్వభౌములవారి శయ్యని. ఇంకా దగ్గరగా రమ్మని ప్రభువుల సౌంజ్ఞ. వినయంతోనూ, కించిత్తు భయంతోనూ ప్రభువుల శయ్య దిశగా కదిలేడు. అతగాడి చెవిని తన నోటి దగ్గరగా చేర్చమని సౌంజ్ఞ చేశారు ప్రభువులు. నిజంగా ఎంతో భయపడిపోయాడు భృత్యుడు- ప్రభువుల శిరస్సుకు చేరువగా తన చెవిని చేర్చడమా? ఎంతటి అనుచిత ప్రవర్తన! కాని తప్పదు- ప్రభువుల ఆజ్ఞ.

భయం భయంగా తన చెవిని ప్రభువుల నోటిదగ్గరకు చేర్చేడు- తను వుండవలసిన దూరంలో వుంటూనే. ఇంతలో ప్రభువులకు ఏం అనుమానం వచ్చిందో ఏమో- తన దృష్టిని భృత్యుని మీంచి మళ్లించి, చుట్టూ నిలిచివున్న వాళ్ల వైపు తిప్పేరు. వారి నయనాల్లోని వేదనా సమ్మిళితమైన అభ్యర్థనని అమాత్యవర్యులు అర్థం చేసుకున్నారు.

'ప్రభువులవారు ఏదో అంతరంగికమయిన విషయాన్ని చెప్పాలని అభిలషిస్తున్నారు. అంచేత దయవుంచి బంధుమిత్ర సభిక మహాశయులంతా దూరం జరగవలసిందిగా మనవి చేస్తున్నాను' అని అంటూ, ముందుగా తనే దూరంగా వెళ్లిపోయేడు అమాత్యవర్యుడు. అంతకుమించిన సంకేతం ఇంకేం వుంటుంది? అక్కడ హాజరై వున్న యావన్మందీ ప్రభువుల మాటలు తమ తమ చెవులకి వినిపించనంత దూరానికి తరలిపోయారు.

ప్రభువు, అంతరంగికుడు- ఇద్దరే మిగిలారు. ప్రభువు ఏదో సందేశాన్ని భృత్యుడి చెవిలో చెప్పేరు. మధ్య మధ్యని ఆపి, 'నీకు బోధపడుతోందా?' అన్నట్టుగా ప్రభువులు చూడడం, బోధపడింది అన్నట్టుగా భృత్యుడు తల పంకించడం యిత్యాది వైనాన్ని అంతరంగికులూ, అమాత్యవర్యుడూ దూరం నించి గమనిస్తూనే వున్నారు. చెప్పవలసిందంతా పూర్తయినాక, మళ్లీ ప్రభువులకు ఏమి అనుమానం వచ్చిందో ఏమో- 'ఏమిటి విన్నావో తిరిగి చెప్పు' అని ఆజ్ఞాపించేరు, సౌంజ్ఞలతో. భటుడు చేతులు కట్టుకొని, తన విన్న సందేశపు పూర్తి పాఠాన్ని వినమ్రంగా విన్నవించుకున్నాడు. 'సరిగ్గానే విన్నావు, ఇక నువ్వు వెళ్లవచ్చు' అన్నట్టుగా తల పంకించి సౌంజ్ఞ చేశారు ప్రభువు. భృత్యుడు మెరుపువేగంతో కదిలేడు- తనకి వప్పచెప్పబడిన కర్తవ్యాన్ని నిర్వర్తించుకొని రావడానికి. కర్తవ్యాన్ని మెరుపు వేగంతో నిర్వర్తించేసి, ఆ విషయాన్ని- ప్రభువులవారు మృత్యువాత పడకముందే- వారికి విన్నవించేయ్యాలనే ఆదుర్దా అతని కదలికలో కనబడుతోంది. అయితే, కర్తవ్యాన్ని తొందరగా నిర్వర్తించుకొని వచ్చేయడం అన్నది అంత సుళువయిన పనేంకాదే! తనకి అప్పచెప్పబడిన పనిని పూర్తి చేసుకురావాలంటే, ఎన్నెన్ని అవరోధాల్ని అధిగమించుకురావాలో అతగాడికి మాత్రం తెలీదా ఏమిటి? అయినా శాయశక్తులా ప్రయత్నించి చూద్దాం- అని కాబోలు ఉరుకులతోనీ పరుగులతోనీ ముందుకి సాగుతున్నాడు.

ఇంతలో ఎవరో ఆపేరు అతగాడ్ని. ఆపి 'ఏంవిటీ, ప్రభువులవారు అంతలా శ్రమపడి, అంత రహస్యంగా ఏదో నీ చెవిలో చెప్పేరు?' అని అడిగేరు.

'ప్రజలకు వారు ఇవ్వదలచుకొన్న అంతిమ సందేశం' అని సమాధానం చెప్పి, వెళ్లడానికి తొందర కనపరిచేడు భృత్యుడు.

'చివరి సందేశమా? అయితే ఇంకా ఆలస్యం ఎందుకూ, ఎక్కడికో పరుగులు తియ్యడం ఎందుకు? వారికి కావలసిన ప్రజలంతా ఇక్కడే ఉన్నాంకదా! అంచేత, ఆ సందేశం ఏమిటో తొందరగా మాకే వినిపించేయ్' అన్నారు, ప్రభువుల మందిరంలోనే తిష్ట వేసుక్కూర్చున్న ఆశ్రిత జనవల్లా.

'నన్ను మన్నించాలి- ఈ విషయంలో ప్రభువులవారి ఆజ్ఞ మరోలా వుంది. తన జ్ఞానాన్ని, యోగ్యతల్ని, మంచితనాన్ని అందరికంటే ముందుగా గుర్తించి, తనని సార్వభౌమునిగా ఎన్నుకున్న ప్రజలకే తన ఆఖరి సందేశం వినిపించాలని ప్రభువులు షరతు విధించేరు. ఆ ప్రజలు తమ యెడల చూపించిన గౌరవాభిమానాలకీ, భక్తి విశ్వాసాలకీ కృతజ్ఞత తెలుపుకునే చర్యగా, తమ సందేశాన్ని ముందుగా ఆ ప్రజలకే వినిపించవలసిందిగా వారి ఆజ్ఞ. ఆ తర్వాతే మిగిలినవారికి ఆ సందేశం చేరాలని వారి సంకల్పం' అని తనని ఆపిన వారికి విన్నవించుకున్నాడు భృత్యుడు.

'అలాగా? సరే, పరుగెత్తు- నీక్కావలసిన మనుషుల కోసం. కానీ, వాళ్లు ఎవరూ చేరుకోలేనంత దూరంలో వున్నారట. ఏమిటి చేస్తావో ఏమిటో, నువ్వే తెల్చుకో. ఏది ఎలా వున్నా, మన ప్రయత్నం మనం మానకూడదు కదా- పరిగెత్తు, పరిగెత్తు' అన్నారు రాజబంధువులు- అక్కసు ధ్వనించే గొంతుకతో.

పరిగెత్తేడు భృత్యుడు. అయితే, అతనికీ తెలుసు-తను గమ్యం చేరుకోడం అంత సుళువేం కాదని. ఎన్ని అడ్డంకుల్నో తప్పించుకొంటూ పరుగెత్తాలి. ముందుగా వలయాలు వలయాలుగా నిలబడి వేచి చూస్తున్న ప్రజల్ని తప్పించుకోవాలా? ఈ మనుషుల గుంపుల్ని తప్పించుకొని బయటపడగలిగితే, తరవాత దాటవలసినవి అనంత దూరాల వరకూ విస్తరించి వున్న రాజభవనాలు. ఆ భవనాలు దాటాలంటే ఎన్నెన్ని ద్వారాలు దాటాలో! ఆ ద్వారాలన్నీ దాటగలిగితే, చివరిగా వచ్చేది సింహద్వారం. దానిదగ్గర చెప్పడానికి వీలులేనంత మంది కాపలాదార్లు- ఎవరూ లోపలికిగాని, బయటికిగాని పోకండా చూడటానికి. ఆ కాపలావాళ్లకి సంతృప్తి కలిగేలా సమాధానాలు చెప్పగలిగితేనే బయటపడగలిగేది. అలా వాళ్లని తృప్తిపరచి బయటపడగలిగితే- ఆ తర్వాత వూళ్లు, అడవులూ, నదులూ, పర్వతశ్రేణులూ, క్రూరమృగాలూ- యిలా ఎన్నో, ఎన్నో అడ్డంకులు ఉండనే ఉంటాయి. ఈ అడ్డంకులన్నిటినీ దాటగలిగితే, -తను ఎవరికైతే సందేశం వినిపించాలో ఆ ప్రజల్ని చేరుకోవచ్చును. కాని వాళ్లంతా సంచారజాతి ప్రజలట. ఇన్ని రకాలుగా శ్రమపడి వాళ్లు వుంటారని భావించబడుతున్న చోటుకి చేరుకోగలిగితే-వాళ్లు అక్కడినుండి మకాం మార్చేసి, ఇంకెక్కడికేనా వెళ్లిపోయివుంటే?

వాళ్లు ఎక్కడ వున్నారో భోగట్టా చేస్తూ- మళ్లా ఎన్నెన్ని అడ్డంకుల్నో దాటుకుంటూ- చివరికి వాళ్లని పట్టుకోగలిగితే...

కాని అప్పటిదాకా సార్వభౌములవారు జీవించివుండాలి కదా!

(మనవి: ఇది Kafka రాసిన An Imperial Message అనే చిన్న Parableని ఆధారంగా చేస్కొని రాసిన కథ)